క్లుప్తంగా

సామాజిక సేవతోనే సంతృప్తి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అరవై ఏళ్లు పైబడిన వారు పింఛన్‌తో ఇంటికే పరిమితం కాకుండా సమాజ సేవకు పునరంకితం కావడం ద్వారా సంతృప్తికర జీవితాన్ని పొందాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కార్యదర్శి మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. మానవత సంస్థ నగర శాఖ వార్షిక సమావేశం స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడిగా ఇమ్మానేని కృష్ణ ప్రసాద్, కార్యదర్శిగా దావులూరి సాంబశివరావు, సంస్థ ప్రాంతీయ అధ్యక్షుడిగా చెరుకూరి బాబు, చైర్మన్‌గా వేమూరు బాబూరావు కోశాధికారిగా పగిడిపల్లి రాములను ఎంపిక చేశారు.

నారాయణ వారాహిదేవిగా దర్శనం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వారాహిదేవి నవరాత్రోత్సవాలలో భాగంగా పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ లలితాంబికా పీఠంలోని వారాహి అమ్మవారిని నారాయణ వారాహిదేవిగా అలంకరించారు. ఉత్సవాలలో 7వ రోజున ఆదివారం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం యాగశాలలో హోమాలు, పంచహారతుల సేవ నిర్వహించగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాలను పీఠం కన్వీనర్ చైతన్య పర్యవేక్షించారు.

హోటల్ నిర్వాహకుల సమస్యల పరిష్కారానికి కృషి

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని హోటల్ నిర్వాహకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని విజయవాడ హోటల్ ఓనర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు పీవీ రమణ అన్నారు. నగరలోని ఓ హోటల్‌లో ఆదివారం విజయవాడ హోటల్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ ఎన్నికలో కార్యదర్శిగా పార్క్ ఎన్ హోటల్ నిర్వాహకుడు వెలగపూడి రాఘవ, కోశాధికారిగా చలువాది మల్లికార్జునరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు పీవీ రమణ మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న హోటల్ నిర్వాహకుల సమస్యల సాధనకు తమ కార్యవర్గం కృషి చేస్తుందన్నారు. జూలై 6న గుణదలలోని హోటల్ హయత్‌లో రాష్ట్ర హోటల్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరగనున్నట్లు పీవీ రమణ ఈ సందర్భంగా తెలిపారు.



అధ్యక్షుడిగా ఎన్నికైన రమణకు అభినందనలు తెలుపుతున్న స్వామి, సంజయ్‌కుమార్

పేద ముస్లింలకు నిత్యావసరాల పంపిణీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఆజాద్ ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు పేద ముస్లింలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. లబ్బీపేట గ్రీన్‌ల్యాండ్స్ వద్ద చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు నాగుల్ మీరా పాల్గొని పేదలకు చీరలు, గోధుమపిండి, బియ్యంలతో కూడిన ప్యాక్‌లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతినెలా ఒక్కో నియోజకవర్గంలో తాము సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ముస్లిం మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, హజ్ యాత్రికుల కూడా సౌకర్యాలు కల్పించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆ కమిటీ తూర్పు అధ్యక్షుడు షేక్ కలందర్, ఎండీ జహీరుద్దీన్, రఫీ, భాష తదితరులు పాల్గొన్నారు.



ఆజాద్ ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలు అందిస్తున్న నాయకులు

కేఎల్‌యూ విద్యార్థినికి జాతీయ స్థాయి అవార్డు

తాడేపల్లిరూరల్ : విజ్ఞాన్ యూనివర్సిటీలో ఈనెల 16 నుంచి జరుగుతున్న సాంస్కృతిక పోటీల్లో తమ విశ్వవిద్యాలయ విద్యార్థిని జాతీయ స్థాయి అవార్డు సాధించిందని యూనివర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగ అధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు తెలిపారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 10వ ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్‌కు చెందిన జె. షణ్ముఖి విజ్ఞాన యూనివర్సిటీలో ఏక్ భారత్ శ్రేష్ట భారత్ అనే కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతిక పోటీలలో కూచిపూడి నృత్య ప్రదర్శనలో అత్యంత ప్రతిభ కనబరిచి, అవార్డు సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఎన్‌సీసీ కమాండర్ కల్నల్ ఎస్.ఎం. చంద్రశేఖర్, వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి విభాగాధిపతి ఆర్. సుభాకర్ రాజు, 25వ ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్ కల్నల్ ఎస్. సిద్ధూ తదితరులు షణ్ముఖిని అభినందించారు.



అవార్డుతో విద్యార్థిని షణ్ముఖి

సారె తెచ్చిన సంబరం



అమ్మవారికి భక్తులు సమర్పించిన సారె



అమ్మవారికి సారె సమర్పించేందుకు విచ్చేసిన భక్త బృందాలు

ఇంద్రకీలాద్రిపై పండుగ వాతావరణం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో సారె సంబరం కొనసాగుతోంది. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని పెద్ద ఎత్తున భక్తులు ఆదివారం అమ్మవారికి సారెను సమర్పించారు. దుర్గగుడి పాలక మండలి సభ్యురాలు అనుమోలు ఉదయలక్ష్మి, సత్తెనపల్లి త్రిశక్తి దుర్గా పీఠానికి చెందిన వి. హనుమత్ స్వామి వారి బృందం, కృష్ణలంకకు చెందిన గంగానమ్మ మహిళా భక్త బృందానికి చెందిన 250 మంది, విజయవాడకు చెందిన ఎస్. ప్రసాద్ బృందానికి చెందిన వంద మంది, ఎస్. వరలక్ష్మి బృందానికి చెందిన 250 మంది, కృష్ణలంకకు చెందిన మరో 50 మంది భక్తులతో పాటు తెలంగాణాలోని పలు ప్రాంతాలకు చెందిన పలువురు భక్తులు అమ్మవారికి సారెను సమర్పించారు. సుమారు 14వందల మంది భక్తులు అమ్మవారికి సారెను సమర్పించేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేయగా, ఆలయ అధికారులు వారిని సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకొని మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తి వద్ద సారెను సమర్పించారు. సారె సమర్పించిన భక్తులకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు.



అమ్మవారి ప్రతిమలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్న భక్త బృందం

నయన మనోహరం.. కూచిపూడి నృత్యం



విజయవాడ కల్చరల్: దృశ్య వేదిక సాంస్కృతిక సేవా సంస్థ నెలవారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు నయన మనోహరంగా సాగాయి. నాట్యాచార్యుడు సప్తా శివకుమార్ బృందం స్వాగత నృత్యంతో ప్రారంభించి కొండలలో నెలకొన్న అన్నమాచార్య కీర్తన, గరుడ గమన భారతీ తీర్థ మహాస్వామి కీర్తన, అదివో అల్లదివో శ్రీహరివాసం, నారాయాణా కీర్తనలకు సాయి, భవ్యశ్రీ, గ్రీష్మ, లాస్య, గీతిక, హవనీష్, సాధన, సహస్ర, చరిష్మా, పాండిత్య, జ్యోతి, మోక్షిత నృత్యాలను అభినయించారు. సాగర్ ఆర్ట్స్ థియేటర్స్ విజయవాడ వారు గురివింద గింజలు సాంఘిక నాటికను ప్రదర్శించారు. రచన బీవీ శ్యాం ప్రసాద్, దర్శకత్వం పవన్‌కుమార్ వ్యవహరించారు. కార్యక్రమాలను ప్రారంభించిన దృశ్య వేదిక వ్యవస్థాపకుడు హెచ్‌వీఆర్‌ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ యువ తలోని ప్రతిభను వెలికి తీయడానికి ప్రతి నెల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వర్షాలు కురుస్తున్న దృష్ట్యా కాచి చల్లార్చిన నీటినే తాగాలని ప్రముఖ ఆయుర్వేద వైద్యనిపుణుడు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియోవైద్య నిపుణుడు డాక్టర్ కోనా వీరబ్రహ్మం, అల్లోపతి వైద్యనిపుణుడు డాక్టర్ ఆదిత్య చంద్రభొట్ల అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేదం, హోమియో, అల్లోపతి వైద్య శిబిరం, అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ముఖ్యంగా వృద్ధులు వేడి వేడి ఆహారంను తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమాలను వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పర్యవేక్షించారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న హోమియో వైద్య నిపుణులు డాక్టర్ కోనా వీరబ్రహ్మం

ముగిసిన సంగీత సద్గురువుల ఆరాధనోత్సవాలు

విజయవాడ కల్చరల్: సంగీత సద్గురువులు సుసర్ల దక్షిణా మూర్తి, పారుపల్లి రామకృష్ణయ్య పంతులు ఆరాధన మహోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో ఐదు రోజులుగా జరుగుతున్న ఈ సంగీతోత్సవంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు, యువ కళాకారులు పాల్గొన్నారు. సంగీత విద్వాంసుడు కస్తూరి గోపాలరావు శ్రీగణనాథం భజరే ఈశ ముత్తుస్వామి దీక్షితార్ కీర్తన, సదామతిన్‌దలతుగదరా త్యాగరాజ స్వామి కీర్తన, ఎక్కడ చూసినా మనరాముడు మైసూర్ వాసుదాసు కీర్తన, దేవదేవం భజే, అన్నమాచార్య కీర్తన, దేవాదిదేవ శ్రీనివాసా మైసూర్ వాసుదేవాచారి తదితర కీర్తనలను ఆలపించారు. రాయప్రోలు అలేఖ్య, పారుపల్లి ఉజ్వల కార్తికేయ, ఎం. అంజనా సుధాకర్, వయోలిన్ విద్వాంసుడు అన్నవరపు రామస్వామి సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. ఉదయం నగరానికి చెందిన పలువురు సంగీత విద్వాంసులు నిర్వహించిన పంచరత్న కృతుల గోష్ఠిగానం ఆకట్టుకుంది. బీవీఎస్‌ఎన్ కృష్ణ, పారుపల్లి ఇభానస్, నేతి శివశంకర్, మార్టూర్ హరిబాబు, డాక్టర్ కె. అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వాగ్గేయకార కీర్తనలను ఆలపిస్తున్న సంగీత విద్వాంసులు కస్తూరి గోపాలరావు

భర్త, అత్త వేధింపుల కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భర్త, అత్త వేధింపులపై ఓ వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహంతిపురానికి చెందిన షేక్ యాస్మిన్‌ను 2022లో రాజీవ్‌నగర్‌కు చెందిన రఫీకి ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. వివాహం అయిన తొలి మూడు నెలలు రఫీ భార్యను బాగానే చూసుకున్నాడు. ఆ తర్వాత గర్భవతి అయిన యాస్మిన్‌ను భర్త రఫీతో పాటు అత్త మున్ని వేధింపులకు గురి చేయడంతో పుట్టింటికి వచ్చేసింది. బిడ్డ పుట్టిన తర్వాత ఇప్పటి వరకూ కూడా పరిస్థితి మారకపోవడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పీపుల్స్ మ్యాక్స్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదివారం దుర్గగుడి ఫ్లై ఓవర్ వద్ద పేదలకు, వాహన చోదకులకు ఆహార ప్యాకెట్ల పంపిణీ జరిగింది. వందలాది మందికి పులిహోర, దద్దోజనం, మంచినీటి ప్యాకెట్లను సొసైటీ ప్రతినిధులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ కోశాధికారి జ్యోత్స్న మాట్లాడుతూ సామాజిక సేవ కార్యక్రమాలలో తమ వంతు పాత్ర ఎల్లప్పుడు పోషిస్తుంటామని, ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన యహాలక్ష్మి యజ్ఞం సందర్భంగా కూడా భక్తులకు మజ్జిగ వితరణ చేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ సీఈవో కె. కార్తీక్ పాల్గొన్నారు.



ఆహార ప్యాకెట్లను అందిస్తున్న సొసైటీ సభ్యులు

మైనార్టీల సంక్షేమానికి పెద్ద పీట



ముస్లిం పెద్దలతో సమావేశమైన మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆసిఫ్

వించిపేట(విజయవాడపశ్చిమ): మైనార్టీల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్‌ఆసిఫ్ అన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎండీ మహమూద్ ఆధ్వర్యంలో 'హర్ దిల్ మే వైఎస్సార్–హమ్ సబ్ జగన్ కే సాత్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లోని బాబుల్ ఉలుమ్ మసీద్‌లో ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్‌ఆసిఫ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక మసీదు వద్ద నెలకొన్న సమస్యలను ఆసిఫ్ దృష్టికి తీసుకువచ్చారు. మైనారిటీల సంక్షేమానికి గతంలో ఎన్నడూ లేనివిధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని పెద్దలకు తెలిపారు. నవరత్నాల పథకాల నుంచి మసీదు ఇమామ్, మౌజన్‌ల జీతాల పెంపు వరకు, హజ్ యాత్రికులకు సౌకర్యాల నుంచి ఉర్దూకి అధికార భాష హోదా వరకు ప్రతి విషయంలోనూ ప్రభుత్వం మైనారిటీలకు అండగా ఉందని ఆసిఫ్ వివరించారు. మన కోసం మన బిడ్డల భవిష్యత్తు కోసం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని బలపర్చాలని ఈ సందర్భంగా ఆయన ముస్లిం పెద్దలకు సూచించారు. మైనార్టీ నాయకులు అలీ, మసీదు ప్రెసిడెంట్ సయ్యద్ హనీఫ్,సెక్రెటరీ సలాం, అతవుర్ రెహమాన్ పాల్గొన్నారు.

4 నుంచి కుట్టు మెషీన్‌పై శిక్షణ


ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్‌లోని మెస్సీయ ఫెలోషిప్ చర్చి ఆధ్వర్యంలో వచ్చే నెల జూలై 4 నుంచి 13వ బ్యాచ్ కుట్టుమెషీన్ క్లాసులు జరుగుతాయని పాస్టర్ డాక్టర్ సజ్జా రత్నకుమార్ తెలిపారు. ఆదివారం చర్చిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 12 ఏళ్ల నుంచి పేద మహిళల ఆర్థికాభివృద్ధి కోసం మెస్సీయ ఫెలోషిప్ ఆధ్వర్యంలో కుట్టుమెషీన్‌పై శిక్షణ ఇస్తున్నామన్నారు. అంతే కాకుండా ఇప్పటి వరకు 400కు పైగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా మెషీన్‌లు ఇచ్చినట్టు చెప్పారు. పేదలకు సేవ చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అంతే కాకుండా వృద్ధులకు నెలనెలా ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. సమావేశంలో కమలా ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ట్రెనింగ్ సెంటర్ నిర్వాహకులు సజ్జా జ్యోతి పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సేవలు అభినందనీయం

కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరంలోని వాసవీ క్లబ్ విజయవాడ చేస్తున్న సేవలు అభినందనీయమని వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఐఈసీ ఆఫీసర్ ఓలేటి శ్రీనివాసగుప్తా, కో ఆర్డినేటర్ పెరుమాళ్ల హరనాథ్ అన్నారు. ఆదివారం కృష్ణలంక, మెట్లబజార్‌లోని వాసవీ కల్యాణ మండపంలో వాసవీ క్లబ్ విజయవాడ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ అనే రైతుకి క్రిమిసంహారక మందు స్ప్రే మిషన్, నాలుగు పేద కుటుంబాలకు రూ.6వేలు విలువైన నిత్యావసర సరుకులు, 10 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం మిలటరీ సైనికుడు ఎం.కోటిరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాన్ టు డస్క్ చైర్మన్ పచ్చిపులుసు సాయిబాబు, వాసవీ క్లబ్ విజయవాడ అధ్యక్ష, కార్యదర్శులు తడికమళ్ల వెంకట సురేష్‌బాబు, వై.వి.వి.సత్యనారాయణ మూర్తి, కోశాధికారి బాలభాస్కర శేషగిరిరావు, రీజియన్ చైర్‌పర్సన్ ఎస్.సూర్యప్రకాష్‌రావు, సెక్రటరీ కె.బి.శివప్రసాద్, జోన్ చైర్‌పర్సన్ ఆత్మకూరి శైలజ తదితరులు పాల్గొన్నారు.



రైతుకు స్ప్రేయర్ అందజేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు




ప్రకాశం బ్యారేజ్ నుంచి ప్రధాన కాలువ గుండా పారుతున్న సాగునీరు


కాలువలకు కొత్త కళ

నగరంలో పారుతున్న కాలువలకు కొత్త కళ వచ్చింది. వ్యవసాయ పనులకు కోసం అధికారులు నీరు విడుదల చేయడం.. కాలువల సుందరీకరణతో ఇప్పటికే కాలువలను నగర పాలక సంస్థ శుభ్రం చేయడంతో నీరు ఆటంకాలు లేకుండా పారుతోంది. అంతే కాకుండా కాలువల్లో చెత్తాచెదారం వేయకుండా వంతెనలకు మెష్‌లను ఏర్పాటు చేయటంతో పాటు వంతెనల వద్ద పారిశుద్ధ్య సిబ్బందిని కాపలా పెట్టారు. కాలువలో చెత్తాచెదారం వేయటం వల్ల కలిగే అనర్థాలను వివరించటంతో పాటు కాలువల పరిరక్షణకు సహకరించాలని అవగాహన కల్పిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



పచ్చని చెట్ల మధ్య బందరు కాలువలో పారుతున్న సాగునీరు



బందరు కాలువపై వంతెన వద్ద చెత్త వేయకుండా పహారా కాస్తున్న మున్సిపల్ కార్మికుడు


ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సి.యం ప్రోగ్రామ్ కన్వీనర్
మా తలశిల రఘురాం MLC అన్నకు
జన్మదిన శుభాకాంక్షలు
తిప్పరమల్లి జమలపూర్ణమ్మ
కృష్ణాజిల్లా గ్రంధాలయ చైర్మన్
తిప్పరమల్లి అశోక్ యాదవ్
జగనన్న నవరత్నాలు... రాష్ట్ర భవితకు పునాదిరాళ్ళు...